నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 18 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

న్యూ ఢిల్లీలో సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్లు యెర్ర శ్రీరంగనాథరాజు, శ్రీనాథరాజు, సాయినాథ రాజు

'సనాతన కంపెనీ'కి జాతీయ స్థాయి గుర్తింపు

బెల్లంపల్లి, జనవరి 17 : బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నది. శుక్రవారం న్యూ ఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో సనాతన కంపెనీ రూపొందించిన వాహన్ డేటా అనాలసిస్ పోర్టల్‌ను ప్రదర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరై ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. కేంద్రమంత్రులు పీయూష్‌గోయల్, నితిన్ గడ్కరీ, హర్‌దీప్ సింగ్ పూరి, మనోహర్ లాల్, కుమారస్వామి అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ కంపెనీలు దాదాపు వెయ్యి పాల్గొన్నాయి. సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని డైరెక్టర్లు యెర్ర శ్రీరంగనాథరాజు, శ్రీనాథరాజు, సాయినాథ రాజు పేర్కొన్నారు.

గంగాజలంతో తిరుగుపయనం

గంగాజలంతో తిరిగి వస్తున్న మెస్రం వంశీయులు

జన్నారం, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో ఈ నెల 28న నిర్వహించే నాగోబా జాతరకు గంగాజలాన్ని తీసుకెళ్లేందుకు 150 మంది మెస్రం వంశస్తులు శుక్రవారం పాదయాత్రగా తరలివచ్చారు. జన్నారం మండలం కలమడుగు గ్రామ సమీపంలోని గోదావరి రేవులోగల హస్తినమడుగుకు చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి గోదావరికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఝరిలో గోదావరి జలాలను సేకరించి తిరుగుపయనమయ్యారు. శుక్రవారం రాత్రి ఉడుంపూర్‌కు చేరుకొని అక్కడ రెండు గంటలు బసచేసి.. ఆపై ఉట్నూరు చేరుకున్నారు. గంగాజలంతో నాగోబాకు అభిషేకం చేసి జాతరను ప్రారంభిస్తామని ఆలయ పూజారి మెస్రం కోసరావు తెలిపారు.

కొందరికే రేషన్ కార్డులు!

గ్రామాల్లో రూ. లక్షన్నర, పట్టణాల్లో రూ.రెండు లక్షల ఆదాయముంటేనే ఇస్తరట

- పదేళ్లక్రితం నాటి నిబంధనలు.. ఇప్పుడు అమలు చేయడంపై విమర్శలు
- 65 ఏండ్లు ఉన్నోళ్లు కూడా అర్హులేనట.. మరి 57 ఏళ్లున్నవారికి ఇక పింఛన్ ఇవ్వరా?
- సర్కారు తీరుపై ప్రజల్లో అనేక అనుమానాలు ● లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకేనంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలు

మంచిర్యాల, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రూ. 2 లక్షల లోపు రుణమున్న రైతులందరికీ మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ కొందరికే అవకాశమిచ్చింది. గెలిస్తే రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి.. ఇప్పుడేమో రూ.12 వేలే అంటున్నది. ఇలా ఆచరణ సాధ్యం కాని అనేక హామీలిచ్చి రైతులను బోల్తా కొట్టించిన సర్కారు, ఇక ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జారీలోనూ అడ్డగోలు కొర్రీలు పెట్టి లబ్ధిదారులను తగ్గించాలని చూస్తున్నది. ఎప్పుడో 2014లో రూపొందించిన నిబంధనలే ఇప్పుడు వర్తింపజేయాలనుకుంటుండగా, అనేక మంది అనర్హులుగా మారే అవకాశమున్నది.

పదేళ్లలో కుటుంబ ఆదాయం పెరిగింది

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గైడ్‌లైన్స్ ప్రకారం.. ఫుడ్ సెక్యూరిటీ (రేషన్) కార్డులకు కుటుంబాల ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉండకూడదు. 2014లో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఆదాయ పరిమితి (సీలింగ్ లిమిట్)ని నిర్ణయించారు. కానీ ఇప్పుడు దాదాపు పదేళ్లు (2025) పూర్తయ్యాక కూడా ఇంకా 2014 ఉత్తర్వులనే వర్తింప చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదేళ్ల క్రితం నెలకు రూ.10 వేలు సంపాదించిన కుటుంబం ఇప్పుడు నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నది. ఈ లెక్కన రేషన్ కార్డు పొందేందుకు అనర్హులవుతారు. ఇక భూముల విషయానికి వస్తే పొలమైతే రెండున్నర ఎకరాలు, ఇతర సాగుభూములైతే ఐదు ఎకరాల్లోపు ఉండాలి. గవర్నమెంట్, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులతో పాటు డాక్టర్లు, కాంట్రాక్టర్లు అనర్హులు. గవర్నమెంట్ పింఛన్‌దారులు, ప్రీడమ్ ఫైటర్ పింఛన్‌దారులకు రేషన్ కార్డు రాదు. కారు కలిగి ఉన్న కుటుంబం సైతం రేషన్‌కార్డు పొందేందుకు అర్హులు కారు. మిగిలిన నిబంధనలు ఎలా ఉన్నా ఆదాయ పరిమితిపై 2014 ఉత్తర్వులనే అమలు చేయడంతో వేలాది మంది ఫుడ్ సెక్యూరిటీ కార్డుకు దూరం కానున్నారు.

పింఛన్ వయసు పెంచుతారా..

గతంలో బీఆర్ఎస్ సర్కారు ఆసరా పింఛన్ పొందే వయసును 57 సంవత్సరాలకు కుదించింది. మానవతా దృక్పథంలో ఆలోచించి తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది వృద్ధులు పింఛన్‌లకు అర్హులయ్యారు. కాగా, ఇప్పుడు రేషన్ కార్డు 65 ఏళ్లలోపు ఉన్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇది కూడా 2014లో తీసుకొచ్చిన నిబంధనే. కానీ గత సర్కారు పింఛన్ వయసు 57 ఏళ్లకు తగ్గించింది. మరి ఇప్పుడు పింఛన్ వస్తున్న వారిలో 65 ఏళ్లలోపు వారు చాలా మంది ఉన్నారు. వారంతా ఇప్పుడు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక వేళ వృద్ధాప్య పింఛన్‌లకు సైతం ఇదే 65 ఏళ్ల నిబంధనల వర్తింప చేస్తే అటు రేషన్‌కార్డులతో పాటు ఇటు పింఛన్‌లకు చాలా మంది దూరమయ్యే ప్రమాదాలు ఉన్నాయి. అంటే 57 ఏళ్లకే ఇప్పుడు పస్తున్న వృద్ధాప్య పింఛన్ ఇకపై రాదా అన్న సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

మంచిర్యాల జిల్లా భీమారంలో అర్హులైన వారికే రేషన్‌కార్డులు ఇవ్వాలని అధికారులను కోరుతున్న స్థానిక యువకులు

వెరిఫికేషన్‌లో ఇష్టారాజ్యానికి ఛాన్స్...

ఆదాయ పరిమితులు, ఆసరా పింఛన్ల విషయంలో క్లారిటీ రావాల్సి ఉండగా, ఇక రేషన్ కార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోకపోవడం, వెరిఫికేషన్ అధికారం రెవెన్యూశాఖకు కాకుండా స్థానిక సంస్థల అధికారులకు ఇవ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్‌కార్డుల కోసం అనేక మంది కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్నారు. రేషన్‌కార్డులు ఇస్తారు అనగానే ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి. ఎలా చేసుకోవాలని అడుగుతున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఎలాంటి దరఖాస్తులు తీసుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిన సోషియో-ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, పొలిటికల్ అండ్ క్యాస్ట్ సర్వే చేశారు. అప్పుడు రేషన్‌కార్డు ఉందా.. లేదా అన్న వివరాలు సైతం సేకరించారు. అంతకు ముందు ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో సేకరించిన వివరాల మేరకు రేషన్‌కార్డులకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెబుతున్నారు. అంటే ప్రత్యేకంగా దరఖాస్తులేవీ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పటికే అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో రేషన్‌కార్డులు కావాల్సిన కుటుంబాల జాబితా సిద్ధమైపోయింది. కాకపోతే దీన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఇలా కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎప్పుడు ఇచ్చిన దరఖాస్తులు, సర్వే ఆధారంగా జాబితాను ఫైనల్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పైగా రేషన్‌కార్డుల వెరిఫికేషన్ చేసే బాధ్యత గతంలో రెవెన్యూ అధికారులపై ఉండేది. కానీ ఇప్పుడు పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో కమిషనర్‌కు అప్పగించారు. దీంతో అక్రమాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జనాలు ఆరోపిస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నాక కూడా రిజెక్ట్ చేసే అధికారం ఈ అధికారులు ఇవ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి.. వచ్చిన దరఖాస్తులపై ఎంక్వైరీ చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ముఖ్యంగా 2014 నిబంధనల్లో మార్పు చేసి ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా నిబంధనలు రూపొందించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. మరి ఈ వ్యవహారం అధికారులు ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కర్షకుల కన్నెర్ర

రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్

- ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఈ నెలాఖరులోగా స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : రూ. 2 లక్షలోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు కన్నెర్ర చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ ఆదివాసీ జిల్లాలో రుణమాఫీ సక్రమంగా అమలు కాలేదని, ఇందుకు కారకులైన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు రుణమాఫీ కాలేదని మండిపడ్డారు. ఆదివాసీ బిడ్డ, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని రైతులందరికీ వెంటనే రుణమాఫీ అయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 31లోగా సర్కారు దిగిరాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొరెంగ మాలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కోట. శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మాడవి గణపతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయి కృష్ణ, డీవైఎఫ్ఐ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ చాపిడి శ్రావణి, జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, టీఏజీఎస్ నాయకులు మరప హన్మంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నెన్నెలలో విలేకరులతో మాట్లాడుతున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

ఏడాదిలో పైసా పని చేశారా?

కాంగ్రెస్ హామీల పేరుతో రైతులను నట్టేట ముంచింది

- రూ. వంద కోట్ల ధాన్యం బుక్కిన మిల్లర్లపై చర్యలు శూన్యం
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల, జనవరి17 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కోసం కనీసం ఒక్కటైనా కొత్త పని తీసుకొచ్చారా అంటూ బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రశ్నించారు. శుక్రవారం నెన్నెలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎమ్మెల్యే వినోద్ పైసా పని చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ సర్కారు ఎన్నికలకంటే ముందే నియోజకవర్గ అభివృద్ధికి రూ . 30 కోట్లు ఇచ్చిందని, ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అవే పనులు చేస్తూ కాంగ్రెస్సే చేపడుతుందని చెప్పు కోవడం సిగ్గు చేటన్నారు. నెన్నెల మండలంలోని ప్రతి గ్రామానికీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్న తపనతో విడుతల వారీగా నిధులు తీసుకువచ్చామని గుర్తు చేశారు. కోణంపేట రోడ్డు, ఎర్రవాగు వంతెన, నెన్నెల ప్రధాన రోడ్డు, కుష్నపల్లి-నెన్నెల రోడ్డు, కొత్తగూడెం, బొప్పారం బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఊరూరా మహిళా శక్తి భవనాల కోసం రూ. 25 లక్షల చొప్పున మంజూరు చేయిస్తే.. ఆ నిధులను ఇతర పనులకు బదలాయించుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని, ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి నట్టేట ముంచిందని విమర్శించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో చేయలేదని, రెండుసార్లు రైతులకు అందాల్సిన రైతుబంధు (రైతు భరోసా) ఇప్పటి వరకూ దిక్కులేదన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ. 2500 ఇస్తామని, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని చెప్పి మాట తప్పిందని మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వంద కోట్ల ధాన్యం బుక్కిన మిల్లర్లపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు వందలకోట్ల అవినీతికి పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే ఇసుకలోనూ దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేక్ల మల్లేశ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంచందర్, మాజీ సర్పంచ్‌లు బాపు, తిరుపతిరెడ్డి, శంకర్, మల్లేశ్, మాజీ ఎంపీటీసీలు ఇబ్రహీం, తిరుపతి, రమేశ్, నాయకులు మోహన్, ప్రేమ్ సాగర్‌గౌడ్, శివప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

పరామర్శ

నెన్నెల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పూదరి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యనారాయణ మృతి గురించి ఆయన కుమారులు పూదరి అంజన్న(పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు), నరేశ్, సురేశ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, నాయకులు మేకల మల్లేశ్, భీమాగౌడ్,ప్రతాప్‌రెడ్డి, రాంచందర్, తిరుపతి, ఇబ్రహీం, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

20న అప్రెంటిస్ మేళా

శ్రీరాంపూర్, జనవరి 17 : శ్రీరాంపూర్ ఐటీఐలో ఈ నెల 20న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా (పీఎన్ఏఎం) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలు స్కైడర్ ఎలక్ట్రిక్ ఇండియా, ఆదర్శ ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, వినయ్ ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎయిర్ స్పేస్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, తోషీబా ట్రాన్స్‌మిషన్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, ప్రీమియర్ ఇంజినీర్స్, మాసన్ లిమిట్స్, స్టార్ హెల్త్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ డిజిల్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, కోపా ట్రేడ్స్ 2024 నాటికి ఉత్తీర్ణులైన అభ్యర్థులు www.apprentice shipindi.gov.inలో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఎస్సీ మెమో, కులం, ఐటీఐ ధ్రువపత్రం, బయోడేటా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

'ఓరియంట్' ఎన్నికలు నిర్వహించాలి

- మెజార్టీ యూనియన్ల అభిప్రాయం ● వాయిదా వేయాలని కోరిన అధికారులు
- ఈ నెల 28న ఫైనల్ అయ్యే అవకాశం

కాసిపేట, జనవరి 17 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై శుక్రవారం ఆదిలాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. మెజార్టీ నాలుగు యూనియన్ల తరుపున ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం ఓరియంట్ సిమెంట్ కంపెనీని అదానీ గ్రూపులు కొనుగోలు చేయడంతో యాజమాన్యం మార్పు ప్రక్రియ కొనసాగుతుండగా, ఎన్నికలు వాయిదా వేయాలని ఓరియంట్ యాజమాన్యం తరుపున అధికారులు కోరారు. ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ యూనియన్లు కోరాయి. ఒక యూనియన్ ఉద్యోగుల సంతకాలతో కూడిన ప్రాతినిధ్య పత్రాలను సమర్పించారు. సమావేశానికి హాజరైన ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్, ది లోకల్ ఓరియంట్ సిమెంట్స్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు హాజరు కాగా, మెజార్టీ నాయకులు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 28న మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అదే రోజున తుది నిర్ణయం వెలువడే అవకాశమున్నది. ఇప్పటికే గుర్తింపు సంఘం ఎన్నికలు లేక మూడేళ్లు అవుతుండగా, ఎలాగైనా ఎన్నికలు నిర్వహించాలని ఓరియంట్ కార్మికులు కోరుతున్నారు.

ఆదిలాబాద్‌లోని లేబర్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

భద్రతా ప్రమాణాలు పాటించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 17: బ్యాంకు లు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రతి ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డును నియమించాలని, సీసీ కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నా రు. శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ఏసీపీలు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, పోలీస్ అధికారులతో సమన్వయం తో పనిచేస్తేనే నేరాలను నియంత్రించవచ్చన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79 ఏటీఎంలు, మంచిర్యాల జోన్ పరిధిలో109 బ్యాంకులు, 89 ఏటీఎంలు ఉన్నాయని, బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు. ఏదైనా ఘటన జరిగితే డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చర్యలు

తమపై ఎలాంటి కేసులు లేవని కొంతమంది తప్పుడు అఫిడవిట్‌లు సమర్పిస్తున్నారని, అ లాంటి వారిపై చర్యలు తప్పవని సీపీ శ్రీనివా స్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జోన్ పరిధిలో పాస్‌పోర్ట్ కోసం, ఉద్యో గ నియామకాల కోసం, బయట దేశాలకు వెళ్లడం కోసం, తదితర కంపెనీ, సంస్థలు, పరిశ్రమల్లో పనిచేయడం కోసం పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్(పీవీసీ), పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) కోసం దరఖాస్తులు చేసుకునేవారిలో కొందరు తప్పుడు అఫిడవిట్‌లు సమర్పిస్తున్నారని, కొంతమందిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

క్రీడాకారులను అభినందిస్తున్న కమాండెంట్ వెంకట్రాములు

క్రీడాకారులకు అభినందనలు

హాజీపూర్, జనవరి 17 : మంచిర్యాల ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అభినందించారు. జిల్లా కేంద్రంలోని శివాజీ మైదానంలో నిర్వహిస్తున్న మంచిర్యాల ప్రీమియర్ లీగ్‌లో గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా గుడిపేట టైటాన్స్ నిలిచింది. జిల్లాస్థాయి పోటీల్లో తమ జట్టు గెలుపొందడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని గుడిపేటలో గల 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో 20 ఏండ్లుగా నాల్గో తరగతి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రాజం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, బెటాలియన్ సిబ్బంది నుంచి సేకరించిన రూ.45,900ను శుక్రవారం బెటాలియన్‌లో రాజం సతీమణి సరోజకు కమాండెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.